కేంద్రం పర్యవేక్షణలోనే సీబీఐ!

పశ్చిమ బెంగాల్ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

స్వతంత్ర సంస్థ అని కేంద్రం చేసిన వాదన తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పశ్చిమ బెంగాల్‌లో సీబీఐ దర్యాప్తు జరపడాన్ని సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పశ్చిమ బెంగాల్ వ్యాజ్యానికి విచారణార్హత లేదని కేంద్రం చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2018 నవంబరు 16న రాష్ట్రంలో సీబీఐ విచారణ జరిపేందుకు సాధారణ అనుమతి విరమించుకుంది. ఇదిలా ఉండగా 2021 మేలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత చెలరేగిన హింసాత్మక ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫార్సు, కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. అయితే, రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తునకు అనుమతిని గతంలోనే విరమించుకున్నందున, ఇప్పుడు విచారణ జరపడానికి వీలు లేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్రం.. సీబీఐను దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించింది.

కేంద్రం వాదన తిరస్కరణ

సీబీఐ విచారణకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వేసిన వ్యాజ్యానికి విచారణార్హత లేదని కేంద్ర ప్రభుత్వం వాదించింది. సీబీఐ స్వతంత్ర సంస్థ అని, దానిపై కేంద్రం పర్యవేక్షణ, నియంత్రణ ఉండదని కేంద్రం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చడాన్ని తప్పుబట్టారు. పశ్చిమ బెంగాల్ వ్యాజ్యాన్ని కొట్టివేయాలని సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశాన్ని బుధవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్(డీఎస్‌పీఈ), 1946 ప్రకారం సీబీఐ ఏర్పడిందని, డీఎస్‌పీఈకి సంబంధించిన అధికారాలు, పరిధి, పర్యవేక్షణ మొత్తం కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలోనే ఉంటాయని కోర్టు పేర్కొన్నది. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వనంత వరకు డీఎస్‌పీఈ కింద ఏర్పడ్డ సంస్థలు రాష్ట్రాల్లో అధికారాలు, పరిధిని విస్తరించడం కుదరదని స్పష్టం చేసింది. డీఎస్‌పీఈ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయా రాష్ట్రాల్లో డీఎస్‌పీఈ ద్వారా ఏర్పడ్డ సంస్థలు అధికారాలను ఉపయోగించలేవని పేర్కొన్నది. పశ్చిమ బెంగాల్ వ్యాజ్యంపై విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది.

ప్యాంటు జేబుల్లో 104 పాములు!

ప్యాంటు జేబుల్లో పాములను దాచుకొని వెళ్తున్న ఓ వ్యక్తి చైనా కస్టమ్స్ అధికారులకు చిక్కాడు. హాంకాంగ్ నుంచి షెన్‌జెన్‌కు వస్తున్న ఓ వ్యక్తిని పుటియన్ సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా ప్యాంటు జేబుల్లో 104 చిన్న పాములు బయటపడ్డాయి. కవర్లలో కట్టి వీటిని చైనాలోకి అక్రమంగా రవాణా చేస్తున్నట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఇవన్నీ అరుదైన జాతులకు చెందిన పాములని చెప్పారు.

ముస్లిం మహిళలకూ భరణం

- మతంతో సంబంధం లేదు..సెక్షన్ 125 వారికీ వర్తిస్తుంది
- భరణం మహిళల హక్కు.. దాతృత్వం ఎన్నటికీ కానేకాదు
- ఇంటిబాగు కోసం మహిళలు చేస్తున్న త్యాగాన్ని గుర్తించాలి
- భార్యకు ఆర్థిక సాధికారతను కల్పించాల్సిన బాధ్యత భర్తదే
- ముస్లిం మహిళకు భరణంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): ముస్లిం మహిళలకు భరణం విషయంలో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద తమ భర్త నుంచి భరణం కోరొచ్చని తెలిపింది. మతంతో సంబంధం లేకుండా వివాహితులందరికీ ఈ సెక్షన్ వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సంచలన తీర్పునిచ్చింది.

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- సెక్షన్ 125 ఆఫ్ ది కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ సెక్షన్ 125) వివాహితలకే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుంది.
- ఆర్థికంగా పెట్టేస్థాయిలో ఉన్న వ్యక్తి.. తన భార్య, పిల్లలు, తల్లిదండ్రుల ఆలనాపాలనకు అవసరమైన ఖర్చు భరించాల్సిందే. సెక్షన్ 125 స్థూలంగా చెప్తున్నది ఇదే.
- మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ విడాకులు తీసుకొన్న అన్నివర్గాల మహిళలకూ వర్తిస్తుంది.
- ఈ సెక్షన్ కింద ముస్లిం మహిళలు కూడా విడాకులు ఇచ్చిన భర్త నుంచి భరణం కోరవచ్చు.
- భరణం ఇవ్వడం అనేది దాతృత్వం కానే కాదు. భరణం కోరడం మహిళల ప్రాథమిక హక్కు.
- భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొందరు భర్తలు గుర్తించడం లేదు.

- కుటుంబం, పిల్లల ఆలనాపాలన కోసం తన కెరీర్, ఉద్యోగాన్ని విడిచిపెట్టి ఎంతో మంది మహిళలు ఇంటికే పరిమితమవుతున్నారు.
- ఆమె త్యాగాన్ని ప్రతీ పురుషుడు గుర్తించాల్సిన సమయం ఇప్పుడు వచ్చింది.
- భార్యకు ఆర్థిక సాధికారత కల్పించాల్సిన బాధ్యత భర్తపై ఉంటుంది.
- లింగ సమానత్వ సాధనకు.. వివాహితలకు ఆర్థిక భద్రత కల్పించాల్సిందే.
- కుటుంబ ఖర్చులకే కాకుండా.. భార్య వ్యక్తిగత అవసరాల కోసం ఆర్థిక వనరులనూ భర్త సమకూర్చాలి.
- ఉమ్మడి బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ షేరింగ్ వంటి పనులతో భర్త ఆమెకు ఆర్థిక సాంత్వన కల్పించాలి.

ఏమిటీ కేసు?

విడాకులు ఇచ్చిన భార్యకు నెలకు రూ. 20 వేల చొప్పున భరణం చెల్లించాలంటూ మహమ్మద్ అబ్దుల్ సమాద్ అనే వ్యక్తిని కుటుంబ న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాలను అబ్దుల్ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశాడు. కుటుంబ న్యాయస్థానం ఆదేశాలను సమర్థించిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ అభ్యర్థన మేరకు భరణాన్ని రూ.10 వేలకు తగ్గించింది. ఆరు నెలల్లోగా ఈ కేసు విచారణను పూర్తి చేయాలని ఫ్యామిలీ కోర్టుకు సూచించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ.. పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం 2017లో తాము విడాకులు తీసుకొన్నామని, ముస్లిం విమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డివర్స్) యాక్ట్, 1986 ప్రకారం.. సీఆర్‌పీసీ సెక్షన్ 125 పరిధిలోకి ముస్లిం మహిళలు రాబోరని వాదించాడు. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం వచ్చే భరణంతో పోలిస్తే, ముస్లిం విమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డివర్స్) యాక్ట్, 1986 కింద లభించే భరణం ఇంకా ఎక్కువని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదించాడు. పిటిషనర్ వాదనలతో విభేదించిన అత్యున్నత ధర్మాసనం.. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు తీసుకున్న భార్యకు భరణం చెల్లించాలంటూ ఆదేశించింది.

భరణం చరిత్ర ఇప్పటిది కాదు..

విడాకులు ఇచ్చిన భార్యకు భరణం చెల్లించే కేసులు కొత్తవేం కాదు. 1985లో షా బానో కేసు ఇందులో ప్రధానమైంది. మతంతో సంబంధంలేకుండా విడాకులు ఇచ్చిన మహిళలకు భరణం చెల్లించాల్సిందేనని సీఆర్‌పీసీ సెక్షన్ 125ను ఉటంకిస్తూ ఆ సమయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. అయితే మరుసటి ఏడాది తీసుకొచ్చిన ముస్లిం విమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవర్స్) చట్టం, 1986.. ఈ తీర్పును నీరుగార్చింది. ఇద్దత్ సమయం (విడాకులు తీసుకొన్న తర్వాత 90 రోజుల వ్యవధి)లోనే భార్యకు.. భర్త భరణం చెల్లించాలని, ఆ మూడు నెలలు పూర్తయ్యాక, చెల్లించాల్సిన పనిలేదని ఆ చట్టం పేర్కొంది. ఈ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టు గడపతొక్కారు. దీంతో ధర్మాసనం.. విడాకులు ఇచ్చిన ముస్లిం భార్యకు ఇద్దత్ సమయంలోనే కాకుండా ఆమె మరో వివాహం చేసుకోవడం లేదా తనకు తానుగా ఆర్థికంగా నిలదొక్కుకునేవరకూ భర్త భరణం చెల్లించాలని ఆదేశించింది. తాజాగా.. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం.. మిగతా వారి లాగే విడాకులు తీసుకొన్న ముస్లిం మహిళకు భరణం ఇవ్వాలని సుప్రీం ఆదేశించింది.

అగ్నివీర్‌ను రద్దు చేయండి

కీర్తిచక్ర, అమరవీరుని తల్లి వేడకోలు

రాయ్‌బరేలి, జూలై 10: దేశంలో సైనికుల నియామకానికి కేంద్రం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకాన్ని నిలిపివేయాలని మరణాంతర కీర్తిచక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ అన్షుమన్ సింగ్ తల్లి మంజు సింగ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. 'రెండు చేతులు జోడించి కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నా. దయుంచి అగ్నివీర్‌ను రద్దు చేయండి. కేవలం నాలుగేళ్లకు వారిని నియమించడం సరికాదు. సైనికుడిగా విధులు నిర్వహించిన వ్యక్తికి ఆ తర్వాత కూడా పెన్షన్, క్యాంటిన్ వంటి సౌకర్యాలు కొనసాగాలి' అని ఆమె అన్నారు. పుణెలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేట్ అయిన అన్షుమన్ సింగ్ గత ఏడాది జూలైలో జరిగిన ప్రమాదంలో తన సహచరులను రక్షించే క్రమంలో గాయపడి మరణించారు. మరణాంతరం ప్రకటించిన కీర్తిచక్రను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఏడాది జూలైన 5న ఆయన భార్యకు అందజేశారు.

నీ కాల్కొక్తా.. పనులు చేయండి

అధికారితో బీహార్ సీఎం నితీశ్

పాట్నా : బీహార్ సీఎం నితీశ్ బుధవారం చేసిన పని అందరినీ అవాక్కయ్యేలా చేసింది. ఆయన శక్తిహీనుడయ్యారని విమర్శలు వచ్చేలా చేసింది. జేపీ గంగాపథ్ ఎక్స్‌ప్రెస్‌వేలో కొంత భాగాన్ని జాతికి అంకితం చేసే కార్యక్రమంలో ఈ సంఘటన జరిగింది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో నితీశ్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దీనిని నిర్మిస్తున్న ప్రైవేట్ కంపెనీ అధికారితో మాట్లాడుతూ, 'కావాలంటే చెప్పండి, మీ కాళ్లకు మొక్కుతాను'అని అన్నారు. దీంతో బిత్తరపోయిన ఆ అధికారి స్పందిస్తూ, 'సార్, అలా చేయకండి' అంటూ వెనుకకు వెళ్లిపోయారు. దీనిపై ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ స్పందిస్తూ, ముఖ్యమంత్రి నితీశ్ శక్తిహీనుడయ్యారని, అందుకే ఆయన అందరి కాళ్లపైన పడటానికి సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు.

తొలి మహిళా ట్రాన్స్‌జెండర్ ఎస్ఐగా మన్వీ

న్యూఢిల్లీ, జూలై 10: దేశంలో తొలిసారిగా బీహార్‌కు చెందిన ఒక ట్రాన్స్‌జెండర్ మహిళ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. బీహార్‌లోని భాగల్‌పూర్ అనే గ్రామానికి చెందిన మన్వీ మధు కశ్యప్ ఈ ఘనత సాధించారు. మన్వీ సహా ముగ్గురు ట్రాన్స్‌జెండర్లను సైతం బీహార్ ప్రభుత్వం ఎస్ఐలుగా ఎంపిక చేసింది. వారిలో ఇద్దరు పురుషులు కాగా, మన్వీ మధు ఏకైక మహిళా ట్రాన్స్‌జెండర్. మంగళవారం వెలువడిన ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో తాను ఎంపికవ్వడంతో మధు ఆనందానికి అవధులు లేవు. 'దీనికోసం నేను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఇప్పుడు వాటి ఫలితం కన్పించింది. నన్ను విద్యాసంస్థల్లో చేర్చుకోవడానికి ఏ ఇన్‌స్టిట్యూట్ వారు ఇష్టపడలేదు. నేనుంటే అక్కడి వాతావరణం కలుషితమవుతుందని వారు భయపడ్డారు. ఈ విజయంతో నా లక్ష్యాన్ని సాధించా. నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే నేనీ రోజు ఇక్కడ ఉన్నా' అని మన్వీ ఉద్వేగంతో పేర్కొన్నారు.

ప్రొబేషనరీ ఐపీఎస్ గొంతెమ్మ కోర్కెలు

మహారాష్ట్ర సర్కారు బదిలీ వేటు

ముంబై: అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు రావటంతో ఓ ప్రొబేషనరీ ఐఏఎస్ ఆఫీసర్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. పుణెలో ప్రొబేషనరీ ఐఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న పూజా ఖేద్కర్ పై అధికారుల అనుమతి లేకుండా తన ప్రైవేట్ ఆడీ కారుకు ఎరుపు-నీలం రంగు బీకన్ లైట్లు, వీఐపీ నంబర్ ప్లేటును ఏర్పాటుచేసుకున్నారు. ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగురాలిగా, ఓబీసీగా ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగం పొందారన్న ఆరోపణలు కూడా ఆమెపై నమోదయ్యాయని ప్రభుత్వ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. కాగా, తండ్రికి రూ.40 కోట్ల ఆస్తి, సొంతంగా ఆడీ కారున్న ఆమె..'ఓబీసీ నాన్ క్రీమిలేయర్ కోటా'లో ఐఏఎస్ ఉద్యోగానికి ఎలా ఎంపికయ్యారు? అని ఓ ఆర్టీఐ కార్యకర్త ప్రశ్నించారు.

సిద్ధరామయ్య భార్యపై పోలీసులకు ఫిర్యాదు

ఫోర్జరీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణలు

బెంగళూరు, జూలై 10: కర్ణాటక రాజకీయాల్లో మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూకుంభకోణం ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తాజాగా ఈ స్కామ్‌కు సంబంధించి సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి, ఆమె సోదరుడు మల్లికార్జున్, మరో వ్యక్తిపై స్నేహమయి కృష్ణ అనే సామాజిక కార్యకర్త మైసూర్‌లోని విజయనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్ధరామయ్య, పార్వతి, ముడా అధికారులతోపాటు మైసూర్ జిల్లా కలెక్టర్, పలువురు ఇతర ప్రభుత్వ అధికారులకు భూ కేటాయింపు కుంభకోణంలో పాత్ర ఉన్నదని ఆరోపించారు. ఇందుకు రెవెన్యూ, ఇతర అధికారులు సహకరించారని ఆరోపించారు. భూ కేటాయింపు వివాదంపై దర్యాప్తు చేయాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ కార్యదర్శులకు కూడా స్నేహమయి కృష్ణ లేఖ రాశారు. అయితే ఈ భూ కేటాయింపులు బీజేపీ హయాంలోనే జరిగాయని సీఎం సిద్ధరామయ్య అంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని బీజేపీ డిమాండ్ చేస్తున్నది.

సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదు

- నీట్-యూజీ అక్రమాలపై కేంద్రం అఫిడవిట్
- మళ్లీ పరీక్ష అవసరం లేదని సుప్రీంకోర్టులో వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 10: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-యూజీ పరీక్షలో సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని సైతం కోర్టుకు తెలియజేసింది. నీట్‌లో అక్రమాలు జరిగినందున మళ్లీ పరీక్ష నిర్వహించాలని పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ అభ్యర్థనలను విచారించిన కోర్టు.. స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో స్పందించిన కేంద్రం... నీట్ పరీక్షపై ఐఐటీ మద్రాస్ సాంకేతికంగా అధ్యయనం చేసిందని, దీని ప్రకారం పరీక్షలో మాస్ మాల్‌ప్రాక్టీస్ జరిగినట్టు ఎలాంటి సూచనలు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నది. ఏ ఒక్క అభ్యర్థి కూడా పరీక్షలో అక్రమాల ద్వారా లబ్ధి పొందలేదని, కాబట్టి మళ్లీ పరీక్ష రాయాల్సిన భారం 23 లక్షల మంది విద్యార్థులకు అవసరం లేదని కోర్టుకు తెలియజేసింది. ఎవరైనా అక్రమాల ద్వారా లబ్ధి పొందినట్టు భవిష్యత్తులో తేలినా కౌన్సిలింగ్ ప్రక్రియ సమయంలోనైనా, ఆ తర్వాత అయినా ఆ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తామని పేర్కొన్నది.

ఇది యుద్ధానికి సమయం కాదు

ఆస్ట్రియా పర్యటనలో ప్రధాని మోదీ

వియన్నా, జూలై 10: ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఆస్ట్రియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ దేశ చాన్స్‌లర్ కర్ల్ నెహమ్మార్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పశ్చిమ ఆసియా, ఉక్రెయిన్ సంక్షోభాలు చర్చకు రాగా, ఇది యుద్ధానికి సమయం కాదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉక్రెయిన్, రష్యా శాంతి ప్రక్రియలో భారత్ ఎంతో ప్రధానమైనదని, అది శక్తివంతమైన ప్రభావవంతమైన పాత్రను పోషించగలదని ఆస్ట్రియన్ చాన్స్‌లర్ కర్ల్ నెహమ్మార్ అన్నారు. అదే సమయంలో తమ దేశం తటస్థ విధానాన్ని అవలంబిస్తుందని అన్నారు. కాగా, 41 ఏండ్ల తర్వాత తొలిసారిగా భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించారని, అలాగే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం ప్రారంభమై 75 ఏండ్లు పూర్తయ్యాయని తెలిపారు.

లక్నో కవి 'డిజిటల్ అరెస్ట్'

సైబర్ కేటుగాళ్ల నిర్వాకం

లక్నో: సైబర్ నేరగాళ్లు తాము సీబీఐ అధికారులమంటూ వీడియో కాల్ చేసి లక్నోకు చెందిన ప్రముఖ కవి, ప్రగతిశీల రచయిత నరేశ్ సక్సేనాను ఆరు గంటల పాటు డిజిటల్ అరెస్ట్ చేశారు. కొన్ని గంటలపాటు ఆయన గది నుంచి బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యుల జోక్యంతో సైబర్ నేరగాళ్ల పాచిక పారకుండా పోయింది. జూలై 7న మధ్యాహ్నం 3 గంటల సమయంలో జరిగిందీ ఘటన. కవి సమ్మేళనానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సక్సేనాకు వీడియో కాల్ చేసిన నేరగాడు తనను తాను సీబీఐ ఇన్‌స్పెక్టర్ రోహన్‌శర్మగా పరిచయం చేసుకుని మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ వారెంట్ జారీ అయిందని హెచ్చరించాడు. ఆ తర్వాత రచయిత బ్యాంకు ఖాతా, లావాదేవీలు ఇతర వివరాలు తెలుసుకున్నాడు. ఆ తర్వాత నీబీఐ చీఫ్ పేరుతో మరో వ్యక్తి లైన్లోకి వచ్చాడు. అయితే, చాలా సేపటి నుంచి సక్సేనా తలుపులు తెరవకపోడంతో అనుమానించిన కుటుంబ సభ్యులు ఆయన గది లోకి వెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదుచేశారు.

ప్రిస్క్రిప్షన్.. పరేషాన్

- ప్రతి రెండు మందుల చీటీల్లో ఒకటి ప్రామాణిక మార్గదర్శకాలకు విరుద్ధం
- ఎయిమ్స్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 10: భారత్‌లో జారీ అవుతున్న ప్రతి రెండు మెడికల్ ప్రిస్క్రిప్షన్లలో (మందుల చీటీ) ఒకటి ప్రామాణిక మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉంటున్నదని, దాదాపు పదో వంతు మందుల చీటీల్లో 'ఆమోదయోగ్యం కాని తేడాలు' కనిపిస్తున్నాయని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. 2019 ఆగస్టు నుంచి 2020 ఆగస్టు మధ్యకాలంలో ప్రామాణిక చికిత్సా మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్యులు జారీ చేసిన 4,838 మందుల చీటీలను ఈ బృందం విశ్లేషించింది. పొట్టలో ఎసిడిటీని తగ్గించేందుకు ఉపయోగించే పాంటోప్రజోల్ ఔషధాన్ని వైద్యులు 54 ప్రిస్క్రిప్షన్లలో శరీరంపై బాధాకరమైన దద్దుర్లను కలిగించే వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రోగులకు సూచించారని ఎయిమ్స్ పరిశోధకుల బృందం గుర్తించింది. 'పాన్ 40' లాంటి పలు పేర్లతో దాదాపు అన్ని మందుల షాపుల్లో లభ్యమయ్యే ఈ మందును పారాసిటమాల్, ఆయింట్‌మెంట్లు సహా ఇతర ఔషధాలతో కలిపి సిఫారసు చేసినట్టు తేల్చింది. పాంటోప్రజోల్‌ను పెప్టిక్ అల్సర్ల ముప్పు ఉన్న రోగులకు మాత్రమే సిఫారసు చేయాలని, ఈ మందును రోగికి సిఫారసు చేస్తే ఇతర దుష్ప్రభావాలకు దారితీయవచ్చని స్పష్టం చేసింది.

మోసపూరిత ఫోన్‌కాల్స్ కట్టడికి 'చక్షు'

యాప్‌ను ప్రారంభించిన ట్రాయ్

న్యూఢిల్లీ, జూలై 10: మోసపూరిత ఫోన్ కాల్స్, మొబైల్ సందేశాలను అరికట్టేందుకు 'చక్షు యాప్'ను ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రారంభించింది. అనుమానాస్పద, మోసపూరిత ఫోన్ కాల్స్ చేస్తున్న ఫోన్ నంబర్లపై తమకు రిపోర్ట్ చేయడానికి, వాటిపై దర్యాప్తు చేపట్టి.. చర్యలు చేపట్టేందుకు ఈ యాప్ దోహదపడుతుందని ట్రాయ్ ఈ సందర్భంగా వెల్లడించింది. చక్షు అంటే హిందీలో కన్ను అని అర్థం. బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపుల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న ముప్పును తక్షణమే అడ్డుకోవటం ఈ యాప్ లక్ష్యమని ట్రాయ్ తెలిపింది.

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

3 వారాల వ్యవధిలో 13వది

సహ్రస: బీహార్‌లో బుధవారం మరో బ్రిడ్జి కూలింది. సహ్రస జిల్లాలోని మహిషి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇలా బ్రిడ్జి కూలడం 3 వారాల వ్యవధిలో ఇది 13వది. ఇది చిన్న బ్రిడ్జి లేదా కాజ్‌వే కావచ్చునని జిల్లా అధికారులు తెలిపారు.రాష్ట్రంలో ఇటీవల వరుసగా బ్రిడ్జీలు కూలుతుండటంతో వాటికి బాధ్యులను చేస్తూ బీహార్ ప్రభుత్వం ఇప్పటికే 15 మంది ఇంజనీర్లను సస్పెండ్ చేసింది.

14 ఉత్పత్తుల అమ్మకాల నిలిపివేత వార్త అవాస్తవం: పతంజలి

న్యూఢిల్లీ: 14 ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేసినట్లు వచ్చిన మీడియా కథనాలపై పతంజలి ఆయుర్వేద వివరణ ఇచ్చింది. ఈ ఉత్పత్తుల తయారీకి ఇచ్చిన లైసెన్సులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం సస్పెండ్ చేసి, అనంతరం పునరుద్ధరించిందని తెలిపింది. ఈ ఉత్పత్తుల ప్రచార వాణిజ్య ప్రకటనలను ఉపసంహరించుకున్నారా? లేదా? తెలియజేస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని తమను సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపింది. తదుపరి విచారణ ఈ నెల 30న జరుగుతుందని తెలిపింది. ''పతంజలి 14 ఉత్పత్తుల అమ్మకాలను నిలిపేసింది'' అనే వార్త తప్పు అని స్పష్టం చేసింది.

కారుణ్య మరణానికి అనుమతించండి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): కారుణ్య మరణానికి తమను అనుమతించాలంటూ కర్ణాటకకు చెందిన పలు కుటుంబాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేశాయి. కొవిడ్ సంక్షోభ సమయంలో ఆక్సిజన్ అందక 2021, మే 2న కర్ణాటకలోని చామరాజనగర్ దవాఖానలో 24 మంది మృత్యువాతపడ్డారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే, మూడేండ్లు గడిచినా అది జరుగలేదు. బాధితుల్లో ఎనిమిది మందికి గత ఫిబ్రవరిలో అవుట్‌సోర్సింగ్ జాబ్స్ ఇచ్చినప్పటికీ, గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు భరించలేక బాధిత కుటుంబాలు నిరసనకు దిగాయి. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలనైనా ఇవ్వాలని లేదా కారుణ్య మరణానికి అంగీకరించాలని డిమాండ్ చేశాయి.

నేరగాళ్లకు కొత్త ముఖాలు

ప్లాస్టిక్ సర్జరీతో రూపం మార్పు.. ఫిలిప్పీన్స్ దవాఖానల్లో దందా

మనీలా, జూలై 10: పోలీసుల కళ్లుగప్పి తప్పించుకునేందుకు నేరగాళ్లు వేషాలు మార్చడం కామన్. ఫిలిప్పీన్స్‌లో మాత్రం నేరగాళ్లు తప్పించుకునేందుకు కొత్త ఎత్తులు వేస్తున్నారు. ఏకంగా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొని గుర్తుపట్టకుండా ముఖాలనే మార్చేసుకుంటున్నారు. ఇందుకోసం ఇక్కడ అక్రమ దవాఖానలు కూడా వెలిశాయి. తాజాగా రాజధాని మనీలాతో పాటు పాసే నగరంలో ఇలాంటి రెండు దవాఖానలను పోలీసులు గుర్తించారు. అక్రమంగా ప్లాస్టిక్ సర్జరీలు చేస్తున్న వియత్నాంకు చెందిన ఇద్దరు, చైనాకు చెందిన వైద్యుడిని అరెస్టు చేశారు. నేరగాళ్ల ముఖాన్ని వీటిల్లో పూర్తిగా